
## ఏఐటీయూసీ రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలి



రాయపర్తి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): ఏఐటీయూసీ రాష్ట్ర మూడవ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీలలో కొత్తగూడెంలో జరగబోయే మహాసభకు రాష్ట్రంలో ఉన్న క్యాబ్, ఆటో ప్రైవేట్ వాహనల కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌంటం రాములు, రఫీ, కొండా సది, రంగు కుమార్, డెక్క రఘు, యూసఫ్, సురేష్, సురేందర్, రాజు, సమ్మయ్య, గడ్ల రవి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల స్థాయి కాంప్లెక్స్ సమావేశం



పర్వతగిరి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): మండలంలోని స్థానిక జెడ్.పి.హెచ్.ఎస్ పర్వతగిరి పాఠశాలలో శుక్రవారం ప్రాథమిక పాఠశాల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహించే, నేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్ష కోసం 3, 6, 9 తరగతుల విద్యార్థులను సిద్ధం చేయాలని, తెలంగాణ రాష్ట్ర ర్యాంకు మెరుగుపరచాలని ఉపాధ్యాయులను కోరారు. ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమాన్ని పక్కాగా పాటించి, బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి చదువుల సత్యనారాయణ, మండల్ నోడల్ అధికారి జి. లింగారెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఏవిఆర్ చార్యులు, రిసోర్స్ పర్సన్స్ శ్రీధర్, శ్రీధర్ గౌడ్, ప్రసాద్ 47 మంది ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి



రాయపర్తి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల తహశీల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీఓ జి. కిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. విద్యార్థులు 3 ఆర్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి కూచన ప్రకాష్, ఏపీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శివల్లే వినోద్ కుమార్, సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సరిత, వైస్ ప్రిన్సిపాల్ లీల, టీచర్స్ రమ్య సుధ, కారోబార్ మల్లయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది రాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి అండగా అండగా ఉంటాం

**- పాలకుర్తి ఎమ్మెల్యే హనుమండ్ల యశస్విని రెడ్డి**



రాయపర్తి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): గత కొద్దీ రోజులుగా అనారోగ్యంతో భాధపడుతూ కొండాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి నరేంద్రర్ రావు హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం సమాచారం తెలుసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే హనుమండ్ల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇంచార్జ్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి వారిని పరామర్శించారు. అనంతరం బాధితునికి అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వారి వెంట పురుషోత్తం రావు, మాదారపు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



రాయపర్తి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ గుగులోత్ కిషన్ నాయక్ కు కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల ఫోరం మండల అధ్యక్షులు బత్తుల నర్సయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో తీవ్రమైన నిధుల కొరత ఉందన్నారు. గ్రామపంచాయతీలలో రోజువారి కార్యకలాపాలకు కార్యదర్శులు వారి జీతాల నుండే ఖర్చు చేయవలసి వస్తుందని తెలిపారు. దీంతో కార్యదర్శులు మానసిక, ఆర్థిక వేదనకు గురౌతున్నట్లు తెలిపారు. వచ్చే నెలలో దసరా, బతుకమ్మ పండుగలు సమీపిస్తున్నాయన్నారు. ఆ వేడుకలు నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలంటే చాలా ఖర్చు వస్తుందని అన్నారు. కార్యదర్శులు తమ జీతాలు నుండి ఖర్చు చేయడం ( తీసుకోవడం ) చాలా ఇబ్బందికరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించాలని, ఎక్కడ పనులు ఒక్కడే నిలిచిపోతున్నాయన్నారు. ఏ కార్యక్రమం చేపట్టాలన్న ఆర్థిక సమస్య ఇబ్బందిగా మారుతుందని అన్నారు. ఇలాంటి పరిస్థితులు రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్న ఏ ఉద్యోగి తమ సొంత జీతంలో ఖర్చు చేయడం లేదని అన్నారు. కార్యదర్శులు మాత్రమే ఖర్చు పెట్టాలంటే తమకు ఆర్థిక భారం పడి, కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని తెలిపారు. గ్రామాలలో ప్రస్తుతం నిర్వహిస్తున్న స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమాలు, బతుకమ్మ, దసరా దీపావళి, పండుగలు సమీపిస్తున్న క్రమంలో పండగల సందర్భంగా ఖర్చుల భారం పడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, నిధులను మంజూరు చేసి, గ్రామ పంచాయతీలను గాడిన పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, కార్తీక్, శాంతిరాజ్, శ్రీనివాస్, రాకేష్, వెంకటేష్, వినోద్ కుమార్, విజేందర్, రవీందర్, రాజు, పవన్ సాగర్, రాజశేఖర్, భరత్, అంబేద్కర్, సంతోష్, పూర్ణ చందర్, అనిల్, రాధిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం ఆస్పత్రికి అత్యాధునతమైన పరికరాలు

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): ఎంజీఎం ఆస్పత్రిలో అత్యాధునతమైన పరికరాలు అందించుటకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకు వచ్చింది జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంజీఎం సూపరిండెంట్ మురళీ, ఆర్ఎంఓ మురళీ , పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమ్మయ్యలతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పలు అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో సిఎస్ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేయుటకు పవర్ గ్రిడ్ ముందుకు వచ్చిందని, అందుకు జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. అనంతరం ఎంజీఎం ఆసుపత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన, కావలసిన పరికరాల వివరాల నివేదికలు సమర్పించాల్సిందిగా ఎంజీఎం సూపరింటెండెంట్ మురళీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ,వరంగల్ తహశీల్దార్ ఇక్బాల్, పవర్గ్రీడ్ జూనియర్ ఇంజినీర్ సీహెచ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ నేతలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు

**- సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనస ప్రసాద్, ఎస్ కే బాష్మియా**





పర్వతగిరి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిజమైన వారసులు సిపిఐ పార్టీ నేతలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వరంగల్ జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్, ఎస్ కే బాష్మియా అన్నారు. శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మందిని బలిదాన మిచ్చి, గడీల పాలనను అంతం చేయడానికి భానుచంద్ దొర బానిసత్వ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా నిజాం నిరంకుశ పాలనను గడగడలాడించిన పోరాట ప్రతిమ కలిగిన పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. సిపిఐ పార్టీకి తప్ప వేరే ఎవరికీ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భాగస్వామ్యం లేదని, అందుకే నిజమైన వారసులు సిపిఐ పార్టీ అంటూ, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పనస ప్రసాద్, ఎస్ కే బాష్మియాలు అన్నారు. పర్వతగిరి మండలంలో చర్ల తండాలో స్థూపానికి నివాళులర్పించి, ఆయన చేసినటువంటి ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. అనంతరం రోళ్ళకళ్ళు గ్రామంలో బైరు శాంతమ్మ స్తూపం వద్ద నివాళులర్పించి, వర్ధన్నపేట మండలంలో ప్రజానాట్యమండలి కళాకారులచే అమరవీరుల నిస్మరించుకుంటూ, కళారూప ప్రదర్శన నిర్వహించారు. అనంతరం టుక్య నాయక్ తండలో టూ కే నాయక్ స్తూపం వద్ద, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ జెండా ఎగరవేశారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో మల్లెపాక డ్రైవర్ యాకయ్య స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం సిపిఐ నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, సిపిఐ నాయకులు ఆరెల్లిరవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దామర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**- రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాలకు రక్షణ కల్పించాలి**

**- ఆర్.ఎస్.పి రాష్ట్ర కమిటీ సభ్యులు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్**



పర్వతగిరి, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): మెదక్ జిల్లా శవంపేట మండలం కాంతన్ పల్లి గ్రామంలోఅంబేద్కర్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై ఆర్.ఎస్.పి రాష్ట్ర కమిటీ సభ్యులు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలా రాజ్యాంగ రచయిత అంబేద్కర్ విగ్రహానికి మరోమారు ఇలాంటి దుర్ఘటన పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయాలని అన్నారు. మనువాదుల గుండెల్లో మర ఫిరంగిగా మారిన అంబేద్కర్ భావజాలం ప్రజల్లోకి వెళుతుందని అన్నారు. భారత ప్రజల నోదటి రాతను మార్చిన అంబేద్కర్ విగ్రహాలను మనువాదులు ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటున్నారు. అంబేద్కర్ ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్న తరుణంలో, కొంతమంది అంబేద్కర్ వ్యతిరేకులు ఇలాంటి సంఘటనలకు పాల్పడడం శోచనీయంగా ఉందని అన్నారు. అంబేద్కర్ ఒక కులానికో, మతానికో సంబంధించిన వ్యక్తి కాదని, భారత ప్రజలందరూ గ్రహించవలసిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి, కఠినంగా శిక్షించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## కీటక జనిత వ్యాధులను నియంత్రించాలి

**- డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ**



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 20,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కాజీపేట వెంకటరమణ శుక్రవారం మామునూరు పోలీస్ శిక్షణ కేంద్రంలో నమోదైన డెంగ్యూ వ్యాధిగ్రస్తురాలిని పరీక్షించి, వైద్యపరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ శిక్షణ కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది సహకారంతో చేపడుతున్న ఆంటీ లార్వెల్ ఆపరేషన్, పైరిత్రం స్ప్రే పనులను పరిశీలించారు. అదేవిధంగా శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, శిక్షణార్ధులకు వైద్య పరీక్షలు చేసి, వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రస్తుతం కాలానుగుణంగా, సంభవిస్తున్న వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు తద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండాలని కోరారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది సహకారంతో సాయంత్రం వేళ ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ సింగ్, పిటిసి వైద్యాధికారి డాక్టర్ బి సుధీర్, ఇన్చార్జ్ ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, హెచ్ఈఓ ఖాసీం, హెల్త్ సూపర్వైజర్లు కలీం, శ్రీనివాస్, సదానందం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణా ఆత్మగౌరవ ప్రతీక బాపూజీ

**బీఆర్ ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులు**



తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన జీవితకాలం పోరాడిన తొలితరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు.తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన బాపూజీ స్ఫూర్తి తాను సాగించిన చివరిదశ రాష్ట్ర సాధన పోరాటంలో ఇమిడివున్నదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ కోసం తాను బయలుదేరిననాడు నాటి ఉమ్మడి రాష్ట్రం లోని తెలంగాణ వ్యతిరేక ప్రభుత్వాల వత్తిడికి తలొగ్గకుండా బాపూజీ తన జలదృశ్యం నివాసాన్ని ఉద్యమ వేదికగా నిలపడం తన తెలంగాణ పోరాటప్రస్థానంలో మరిచిపోలేనిదని కేసీఆర్ అన్నారు.బాపూజీ ప్రదర్శించిన నిక్కశ్చితనం,నిరాడంబరత లక్ష్య సాధనకోసం తాను కనబరిచిన పట్టుదల తననెంతో ప్రభావితం చేశాయని కేసిఆర్ గుర్తుచేసుకున్నారు. న్యాయవాదిగా, రాజనీతిజ్ఞుడుగా స్వాతంత్రోద్యమకాలం నుంచి రాష్ట్ర సాధన చివరిదశదాకా బాపూజీ చేసిన కృషిని రేపటి తరాలకు అందించే దిశగా నాటి బిఆర్ ఎస్ ప్రభుత్వం వారి స్మారకార్థం పలు కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు . బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కొనసాగిన బిఆర్ ఎస్ పదేండ్ల ప్రగతి పాలనలో కొండా లక్ష్మణ్ బాపూజీ అశయాలు ఇమిడివున్నాయని కేసీఆర్ తెలిపారు.

